# దినదిన గండం

**శిథిలావస్థకు పురాతన జామియా మసీదు**

- పెచ్చులూడుతున్న మసీదు శ్లాబ్
- బిక్కు బిక్కుమంటూ ముస్లింల ప్రార్థనలు
- తామే పునర్నిర్మించుకుంటామన్నా.. ససేమిరా అంటున్న వక్ఫ్ బోర్డు
- సోమవారం అకస్మాత్తుగా మసీదు వెనుక భాగంలో కూలిన స్టెయిర్‌కేస్



పాతనగరం చెంగల్రావుపేటలోని పురాతన జామియా మసీదు



శ్లాబ్ పెచ్చులూడటంతో నమాజ్ సమయంలో ముస్లింలపై పడకుండా కట్టిన పరదా

**డాబాగార్డెన్స్:** మహా విశాఖ పాతనగరంలో ఉన్న జామియా మసీదుకు ఎంతో చరిత్ర ఉంది. జిల్లాలోనే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అతి పురాతన మసీదుగా పేరుగాంచింది. వందేళ్లకు పైగా చరిత్ర గల ఈ మసీదు శిథిలావస్థకు చేరి దిన దిన గండంగా మారింది. కొంత మంది మత పెద్దలు 70 ఏళ్ల కిందట ఈ మసీదును తేలికపాటి అభివృద్ధి చేశారు. 20 ఏళ్ల కిందట మరికొంత అభివృద్ధి చేపట్టారు. పైపై మెరుగులు దిద్దడం మాత్రమే జరిగింది. ప్రస్తుతం ఆ మసీదు శిథిలావస్థకు చేరింది. నమాజ్ చేసే సమయంలో మసీద్ శ్లాబ్ పెచ్చులూడిన సంఘటనలు అనేకమున్నాయి. మసీదును పూర్తిగా నేలమట్టం చేసి నూతనంగా నిర్మించుకుంటామని విజయవాడలోని వక్ఫ్ బోర్డు సీఈవో ఖాదర్ బాషాకు జామియా మసీదు కమిటీ పలుమార్లు వినతులు అందజేసింది. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లింది. చివరికి ఫలితం లేకపోయింది. తాజాగా సోమవారం ఉదయం కురిసిన వర్షానికి మసీదు వెనుక భాగాన స్టెయిర్‌కేస్ కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

**నిత్యం వందలాది మంది ముస్లింల రాక**

పాతనగరం చెంగల్రావుపేటలో పురాతన జామియా మసీదు ఉంది. ఇక్కడికి ప్రతి రోజూ వందలాది మంది ముస్లింలు వచ్చి నమాజ్ చేస్తుంటారు. శుక్రవారాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారు. రంజాన్, బక్రీద్ మొదలగు పండగల సమయాల్లో ఆ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మసీదు శిథిలావస్థకు చేరడంతో నమాజ్ చేసే సమయంలో శ్లాబ్ పెచ్చులూడుతూ పలువురు ముస్లింలపై పడ్డాయి.

**స్పందించని వక్ఫ్ బోర్డు**

విశాఖలోని పురాతన జామియా మసీదు శిథిలావస్థకు చేరుకుందని, ముస్లింలు, మత పెద్దలు, దాతల సహాయ సహకారాలతో ప్రస్తుతం ఉన్న మసీదును కూలగొట్టి ఆధునికంగా తీర్చిదిద్దుకుంటామని విజయవాడలోని వక్ఫ్ బోర్డు సీఈవో ఖాదర్ బాషాను మసీదు కమిటీ ప్రతినిధులు కలిసి మొర పెట్టుకున్నారు. పలుమార్లు వినతులు అందజేశారు. ఏవేవో కుంటిసాకులు చెప్పుకుంటూ..



జామియా మసీదు పునర్నిర్మాణానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మసీదు నిర్మాణం చేపట్టడానికి వీల్లేదంటూ హుకుం జారీ చేసినట్లు మసీదు కమిటీ ప్రతినిధులు 'సాక్షి'కి తెలిపారు. ప్రభుత్వం నిర్మించదు.. పోనీ దాతల సహకారంతో కమిటీయే నిర్మించుకుంటుందని వేడుకుంటున్నా.. వక్ఫ్ బోర్డు ససేమిరా అంటోందని కమిటీ ప్రతినిధులు, ఆ మసీదుకు వెళ్లే ముస్లింలు వాపోతున్నారు.

**కూలగొట్టాలని ఏయూ రిపోర్టు ఇచ్చినా..**

జామియా మసీదుకు సంబంధించి ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియదని, వెంటనే కూలగొట్టేయాలని ఏయూ సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్లు వజీర్ మహ్మద్, డాక్టర్ కె.శ్రీనివాసరావు రిపోర్టు ఇచ్చారు. గత ఆగస్టులో వారి నేతృత్వంలో ఏయూ సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు జామియా మసీదును పరిశీలించారు. దాని పరిస్థితి బాగోలేదని, వెంటనే డిమాలిస్ చేయాలని, లేదంటే ఎప్పుడు ఎక్కడ(మసీదు ప్రాంగణంలో) కూలుతుందో తెలియదని నిపుణులు హెచ్చరించారు. ఆ కాపీని కూడా మసీదు కమిటీ ప్రతినిధులు వక్ఫ్ బోర్డు సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఆయన నుంచి స్పందన కరువైందని వారు వాపోయారు.



మసీదు మధ్య భాగంలో ఊడిన శ్లాబ్ పెచ్చులు



వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. వర్షానికి కూలే అవకాశమున్న వెనుక భాగం

**ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు..**

శిథిలావస్థలో ఉన్న జామియా మసీదు విషయంలో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులో తెలపాలని కమిటీ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ, ప్రభుత్వం హెచ్చరిస్తోందని చెప్పారు. జరగరాని ఘటన ఏమైనా జరిగి మసీదు కూలితే దానికి ఎవరు బాధ్యులవుతారో ప్రభుత్వమే తేల్చుకోవాలని ముందుగా హెచ్చరించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లామని, వక్ఫ్ బోర్డు సీఈవో నుంచి మాత్రం ఎటువంటి స్పందన లేదని లబోదిబోమంటున్నారు. వక్ఫ్ బోర్డు సీఈవో స్పందించి కమిటీ నేతృత్వంలో ఆధునికంగా మసీదును తీర్చేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## సింహాద్రినాథుడిని దర్శించుకున్న వాసుపల్లి



కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుంటున్న వాసుపల్లి

**డాబాగార్డెన్స్:** సింహాచల పుణ్యక్షేత్ర దర్శనం అదృష్టమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. సింహాద్రినాథుడిని సోమవారం ఆయన దర్శించుకుని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అక్కడి శివాలయంలో శివలింగానికి పూజలు చేశారు. ద్వయవతార రూపుడు సింహాచల చందన స్వామిని మా మత్స్యకారులు ప్రీతిపాత్రంగా కొలుస్తారన్నారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ఇవ్వాలని అప్పన్నకు వాసుపల్లి పూజలు చేశారు.

## ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

**జగదాంబ:** జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలువురి నుంచి జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సిబ్బంది ఆదేశించారు. వినతుల్లో ఇచ్చిన ఫోన్ నంబర్ ద్వారా సమస్య పరిష్కారమైందా.. లేదా.. అని ఫిర్యాదుదారులను అడిగి తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా పరిష్కారమైన సమస్యలను రికార్డులో రాసి ఉంచాలని సూచించారు. రెవెన్యూ, పబ్లిక్ హెల్త్ విభాగాలకు సంబంధించి ప్రజలు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఝాన్సీ, రెవెన్యూ అధికారులు అప్పలరాజు, ఏపీడీ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

**డాబాగార్డెన్స్:** బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

### స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోస్ట్‌కార్డు ఉద్యమం

**సీతమ్మధార:** విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభిస్తామని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్, రైటర్స్ అకాడమీ అధ్యక్షుడు వి.వి.రమణమూర్తి తెలిపారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీ పార్కులో సోమవారం పలు సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది జనవరి 27న లక్ష మంది ప్రజలతో నిర్వహించే ఈ కార్యక్రమ విజయవంతానికి దశల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. ప్రతి ఇంటి నుంచి కేంద్రానికి పోస్ట్‌కార్డు ద్వారా నిరసన గళం వినిపిస్తామన్నారు. మొత్తం 10 లక్షల వరకు పోస్ట్‌కార్డులను కేంద్రానికి పంపుతామన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం తక్షణ సాయం కింద రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని కోరారు. ఢిల్లీ వెళ్లిన సీఎం చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ విషయమై ప్రజలకు ఎటువంటి తీపికబురు చెప్పలేకపోయారని ఎద్దేవా చేశారు.


### ఐఎంఎఫ్ఎల్ డిపోల్లో జట్ల పనులు కొనసాగించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

**మహారాణిపేట:** ఐఎంఎఫ్ఎల్ డిపో 1, డిపో 3ల్లో రెండు జట్ల పనులను యథావిధిగా కొనసాగించాలని హమాలీలు, కార్మికులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. విశాఖ జిల్లా ముఠా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ డిపోల్లో 30 ఏళ్లుగా లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసుకుంటూ 110 కుటుంబాలు జీవిస్తున్నాయని కార్యదర్శి ఎం.సుబ్బారావు తెలిపారు. డిపోల ప్రారంభం నుంచి అధికారుల పట్ల వినయ విధేయతలతో సేవలందిస్తున్నారని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా పనులకు ఆటంకం కలగకుండా చూస్తున్నామన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల అనేక నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, తమ జీతాలు పెరగలేదని, తక్షణం జీతాలు పెంచాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

**కంచరపాలెం:** జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు పలు సమస్యలపై సోమవారం 06 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ 02, పబ్లిక్ హెల్త్ 02, ఇంజినీరింగ్ విభాగానికి 02 వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరావు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి

**డాబాగార్డెన్స్:** వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన పర చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఎప్పటికప్పుడు రోడ్లు, కాలువల శుభ్రత



వార్డులో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

**జగదాంబ:** వీధుల్లో పేరుకుపోయిన చెత్తను యార్డుకు తరలించి, పరిసరాలను శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందికి జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. 31వ వార్డు కార్యాలయంలో సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఎల్లమ్మతోట, ఎస్‌బీఐ కాలనీ, బొడ్డు నాయుడుతోట ప్రాంతాల్లో పర్యటించారు. ఎల్లమ్మతోట వద్ద పారిశుధ్యాన్ని పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ కాలువలు, రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు ఉదయం, మధ్యాహ్నం సమయానికి విధులకు హాజరు కాలన్నారు. అప్పుడే రోడ్లు శుభ్రంగా ఉంటాయన్నారు. సిబ్బంది సేకరిస్తున్న చెత్తను పరిశీలించారు. నివాసులు తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. వీధిలైట్లు సమస్యలు లేకుండా చూడాలని ఎలక్ట్రికల్ అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా దోమల నిర్మూలనకు ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. జెడ్సీ వెంట వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, సిబ్బంది ఉన్నారు.

## ఏఎంసీలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం

- ఎంబీబీఎస్ నూతన విద్యార్థులకు అవగాహన, సూచనలు



ప్రసంగిస్తున్న ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్. చిత్రంలో ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ఇతర వైద్యులు

**మహారాణిపేట:** ఆల్ ఇండియా కోటా, స్టేట్ కోటాలో మొదటి రెండు రౌండ్ల కౌన్సెలింగ్‌లో చేరిన 2024 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం ఆంధ్రా మెడికల్ కాలేజీ సోమవారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించింది. పాఠ్యాంశాలు, ర్యాగింగ్ నిరోధక చర్యలు, హాస్టల్ సౌకర్యాలు మొదలైన వాటిపై కొత్తగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఏఎంసీలో అవగాహన కార్యక్రమాన్ని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ నిర్వహించారు. వైద్య విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. తరగతుల నిర్వహణ, పాఠ్యాంశాలు బోధించడం, ఇతర అంశాలపై విద్యార్థులకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణి అవగాహన కల్పించారు. అనాటమీ విభాగాధిపతి, బాలుర హాస్టల్ వార్డెన్ డాక్టర్ రవీంద్రకిషోర్, హెచ్‌వోడీ బయోకెమిస్ట్రీ–గర్ల్స్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ భవాని, డాక్టర్ పద్మ గీతాంజలి, డాక్టర్ లక్ష్మణ్, అనాటమీ ప్రొఫెసర్, డిప్యూటీ వార్డెన్ డాక్టర్ అశోక్ తదితరులు ప్రసంగించారు. కొత్తగా చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ముందుగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి సుమారు 220 మంది విద్యార్థులు హాజరయ్యారు.



కార్యక్రమానికి హాజరైన 2024 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

## యూజీడీ పనులు పూర్తి చేయండి

**అల్లిపురం:** జీవీఎంసీ 33వ వార్డులో అసంపూర్తిగా నిలిచిపోయిన యూజీడీ పనులను తక్షణమే పూర్తి చేయాలని వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె జీవీఎంసీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ వార్డులోని అమ్మవారి వీధిలో డోర్ నంబర్ 31-4-1 నుంచి 31-4-90 వరకు, వివేకానంద కాలనీలో డోర్ నంబర్ 31-35-1 నుంచి 31-35-50 వరకు, కుమ్మర వీధిలో డోర్ నంబర్ 31-7-1 నుంచి 31-7-145 వరకు, బంగారమ్మ మెట్టలో డోర్ నంబర్ 31-8-1 నుంచి 31-8-145 వరకు, వెంకటేశ్వరమెట్టలో డోర్ నంబర్ 31-10-1 నుంచి 31-10-18 వరకు, 31-12-1 నుంచి 31-12-45 వరకు, 31-34-1 నుంచి 31-34-145 వరకు సగం పగం యూజీడీ పనులు చేసి నిలిపివేశారని వివరించారు. బండరాళ్లు అడ్డం వచ్చాయని అర్ధాంతరంగా పనులు ఆపివేశారన్నారు. నగరం మొత్తం యుజీడీ పనులు పూర్తయినా.. 33వ వార్డులో నేటికీ పూర్తిస్థాయిలో జరగలేదని తెలిపారు. యూజీడీ పనులను త్వరితగతిన పూర్తి చేసి వార్డు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్‌ను పచ్చిరిపల్లి లక్ష్మి కోరారు.

## పోర్టు హాస్పిటల్ పీపీపీ బిడ్స్ రద్దుకు డిమాండ్

**తాటిచెట్లపాలెం:** పోర్టు హాస్పిటల్‌ను పీపీపీకి ఇచ్చేందుకు ప్రతిపాదించిన బిడ్స్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, ఆస్పత్రిని పోర్టు అథారిటీయే సొంతంగా నిర్వహించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరాయి. ఏఐటీయూసీ నాయకుడు మసేన్, హెచ్ఎంఎస్ నాయకుడు మంగనాయుడు, సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, ఐఎన్‌టీయూసీ నాయకుడు గొర్లె చందు, సీఎఫ్‌టీయూ నాయకుడు మూర్తి, బీఎంఎస్ నాయకుడు రవిశంకర్ మాట్లాడారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ఏటా కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. కార్మికుల కష్టాలతోనే వేల కోట్లు సంపాదించి ప్రస్తుతం వారి ఆరోగ్యాన్ని గాలికొదిలేయాలనుకోవడం సరికాదన్నారు. ఈ ఆస్పత్రిని ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని బీజేపీ ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని ఆరోపించారు.

## బ్రహ్మకుమారీస్ సంస్థ సేవలు అమోఘం



మాట్లాడుతున్న విశాఖ ఎంపీ శ్రీభరత్. చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చీ

**అల్లిపురం:** బ్రహ్మకుమారీస్ సంస్థ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు అమోఘమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బ్రహ్మకుమారీస్ విశాఖపట్నం మీడియా వింగ్ సర్వీస్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. బ్రహ్మకుమారీస్ సంస్థ పలు అంశాలపై మౌంట్ అబులో చేపట్టిన విశ్లేషణలు మీడియా మిత్రులకు ఉపయోగపడతాయన్నారు. మీడియా బాధ్యతాయుత వార్తలు రాయాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ మీడియా సదస్సు విజయవంతంగా పూర్తి చేసిన పాత్రికేయులను అభినందించారు. ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం మంచిదేనని, నిజాన్ని నిర్భయంగా, స్వేచ్ఛగా రాయాలని సూచించారు. పోలీస్, మీడియా పరస్పర సహకారంతో ముందుకు సాగుదామన్నారు. విశాఖను మరింత సురక్షిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సీపీ తెలిపారు. సదస్సులో పాల్గొన్న మీడియా ప్రతినిధులకు ఎంపీ, సీపీలు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు మధు, మురళీకృష్ణ, సునీత, నారాయణ, వంశీ, జయలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

## కేజీహెచ్ సెక్యూరిటీ గార్డుల ఆందోళన



కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

**మహారాణిపేట:** బకాయి జీతాలు ఇవ్వాలని కోరుతూ కేజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు సోమవారం ఆందోళనకు దిగారు. 3 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, దసరా సందర్భంగా ఇస్తారని భావించినా చెల్లించకపోవడంతో వీరంతా ప్రదర్శన నిర్వహించారు. కేజీహెచ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి, జీతాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, సీఐటీయూ నాయకుడు కె.చంద్రశేఖర్ కేజీహెచ్‌లో పనిచేస్తున్న సాయి సెక్యూరిటీ గార్డులు సుమారు 30 మందితో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శన అనంతరం విధులకు హాజరయ్యారు. న్యాయపరమైన డిమాండ్లను తక్షణం ఆమోదించాలని, బకాయి జీతాలు ఇవ్వాలని కార్మికులు నినాదాలు చేశారు. తమకు న్యాయభద్రమైన జీతం రూ.11,257 ఇవ్వాలని, కాంట్రాక్టర్ రూ.9,090 మాత్రమే ఇస్తున్నారని, కటింగ్‌ల పేరిట మిగిలిన సొమ్ము ఇవ్వడం లేదని సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మురుగు నీటి ప్రవాహం



కలెక్టరేట్ డౌన్‌లో కోస్టల్ బ్యాటరీ వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు.
– ఫొటో, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

## పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



మహిళా కార్మికులకు చీరలు అందజేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

**డాబాగార్డెన్స్:** సంఘ సేవకుడు, స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సి.ఎం.ఎ.జహీర్ అహ్మద్ 75వ జన్మదిన వేడుకలు సోమవారం స్వామి వివేకానంద సంస్థ ఘనంగా నిర్వహించింది. సంస్థ సభ్యులు ఆయన చేతుల మీదుగా కేక్ కట్ చేసి, ఘనంగా సత్కరించారు. అనంతరం పలువురు పారిశుధ్య కార్మికులకు డాక్టర్ జహీర్ అహ్మద్ చీరలు అందజేశారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యుల పుట్టినరోజు వేడుకలు సంస్థలోనే నిర్వహిస్తున్నామన్నారు. తన వంతు సహాయ సహకారాలు సంస్థకు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జహీర్ అహ్మద్ సోదరులు రహీద్ అహ్మద్, సీఎంఎ జలీల్ అహ్మద్, మహ్మద్ సాహెబాల్, మసూద్ ఖాన్, ఉమ్మడి రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ముస్తాఫ్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు, ట్యూషన్ పిల్లలు పాల్గొన్నారు.